# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

**జనవరి 10, 2018**

## భారత దోపిడీ పాలకవర్గాలకు ప్రత్యేకించి బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు శక్తులకు కొమ్ముకాస్తున్న బూటకపు భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేయండి!

## నూతన ప్రజాస్వామిక రాజ్యాంగ నిర్మాణానికై ధైర్యంగా పోరాడండి !

### 68వ బూటకపు గణతంత్ర దిన వేడుకల సందర్భంగా సిపిఐ (మావోయిస్టు) పిలుపు!

1950 జనవరి 26ను భారత గణతంత్ర దినంగా చెప్పుతూ ఈ యేడు కూడా భారత దోపిడీ పాలకవర్గాలు పెద్దెత్తున ఉత్సవాలు జరుపుతున్నాయి. అవి భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగంగా మురిసిపోతుంటాయి. వాస్తవానికి అందులోని 395 అధికరణలలో సగానికి పైగా బ్రిటిషు వారి రాజ్యాంగం నుండి మిగతావి ఇతర దేశాల రాజ్యాంగాల నుంచి తీసుకుని పొందుపరిచినవే. ఆ నకలు ప్రతిలో దేశ పౌరులకు ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలతో సహా అనేక హామీలు గుప్పించారు. కానీ నిజానికి భారత పౌరులకు రాజ్యాంగం హామీ పడినవేవీ ఆచరణలో అమలే కావడం లేదు. ఇందుకు భిన్నంగా అది భారత దోపిడీ పాలకవర్గాలకు, ప్రత్యేకించి బ్రాహణీయ హిందూ ఫాసిస్టు శక్తులకు కొమ్ముకాస్తుందని గత 67 సంవత్సరాల 'గణతంత్ర' భారత చరిత్ర రుజువు చేసింది. అందుకే దానికి టాయిలెట్ పేపర్‌కు మించిన విలువే లేదని మా పార్టీ గతంలోనే చెప్పింది. నిజానికి రాజ్యాంగ రచనలో తను ఒక పనిముట్టుగా, తన అభిప్రాయాలకు భిన్నంగా వ్యవహరించానంటూ అంబేద్కర్ వాపోయిన విషయం, రాజ్యాంగం దుర్వినియోగం అవుతుందంటే దాన్ని తగులబెట్టే మొదటి వాణ్ని నేనే అవుతానంటూ ఆ మహానుభావుడు ఘోషించిన విషయం ఇక్కడ గమనార్హం. దేశంలోని ప్రగతిశీల, ప్రజాస్వామ్య, లౌకికవాద రాజ్యాంగ ప్రియులంతా దాని బూటకత్వాన్ని ఇప్పటికైనా గుర్తించాలి. అలాంటి బూటకపు రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు యావత్తు పీడిత ప్రజానీకం, పీడిత జాతులు, పీడిత సెక్షన్లు నడుం బిగించాలి. అలాంటి రాజ్యాంగాన్ని పాతరేసి నూతన ప్రజాస్వామిక రాజ్యాంగ నిర్మాణానికి ధైర్యంగా పోరాడాల్సిందిగా ఈ సందర్భంగా మా పార్టీ సిపిఐ (మావోయిస్టు) వారికి పిలుపు నిస్తున్నది.

కేంద్రంలో హిందుత్వ శక్తులు అధికారంలోకి వచ్చిన గత మూడేళ్లుగా మున్నెన్నడూ లేని విధంగా భారత రాజ్యాంగాన్ని ఎంతగానో ప్రశంసిస్తున్నారు. రాజ్యాంగ రూపశిల్పిగా గణుతికెక్కిన అంబేద్కర్‌ను ఆయన జయంతి, వర్ధంతుల సందర్భంగా కరడు గట్టిన కాషాయ ఉగ్రవాది, దేశ ప్రధాని మోదీ తెగ పొగడడం చూస్తూనే ఉన్నాం. మోదీ, మోదీత్వ శక్తులు ఈసారి 2018లో మున్నెన్నటికన్నా వైభవంగా ఆ దినాన్ని జరుప తలపెట్టారు. ఈ 'గణతంత్ర' దిన వేడుకలకు ఆసియాన్‌కు చెందిన అనేక దేశాల దిగ్గజాలను ఆహ్వానిస్తున్నారు. వర్తమాన పాలకులకు అలా ఆహ్వానించవలసిన అవసరం ఎంతగానో ఉన్నది. తరతరాలుగా దేశ వనరులను కాపాడుతున్న మూలవాసీ ప్రజల అస్తిత్వాన్ని సైతం లెక్క చేయకుండా వాటిని సామ్రాజ్యవాద బహుళజాతి కార్పొరేట్లకు దోచబెట్టడం కోసమే ఈ ఆర్భాటమంతా.

వాస్తవంగా భారతదేశం ఎన్నడూ గణతంత్ర దేశం కాదు. 1947 అధికార మార్పిడికి ముందు బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు ఇది వలస కాగా, ఆ తర్వాత నుంచి అది అర్ధ వలసగా అనేక సామ్రాజ్యవాదుల దోపిడీ పీడనల కింది నలిగిపోతూ వస్తున్నది. దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల నిరంకుశత్వానికి ప్రాతినిధ్యం వహించే భారత రాజ్యాంగం, రాజ్యాంగ యంత్రం సామ్రాజ్యవాదానికి సేవ చేసే పనిముట్లు తప్ప మరొకటి కాదు. అది కార్మికులు, రైతాంగం, పెటీ బూర్జువా, జాతీయ బూర్జువా వంటి పీడిత వర్గాలకు, దళితులు, ఆదివాసీలు, మతమైనారిటీలు వంటి పీడిత సెక్షన్లకు, పీడిత జాతులకు వ్యతిరేకమైనది.

ఈ దేశ పాలకులు దేశంలోని 'ప్రజాస్వామ్యం' మూడు స్తంభాలపై నిలిచి ఉందని గొప్పలు చెబుతుంటారు. కానీ వీటిలో మొదటిదయిన చట్టసభలకు ఆ స్పృహ లేదనీ, అవి అఖాడాగా మారయంటూ దేశ భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీయే తన ముగింపు సందేశంలో దుయ్యబట్టాడు. చేతిలో బెత్తం పట్టాల్సి వస్తుందంటూ స్పీకర్ సుమిత్రా మహాజన్ విసుక్కోవడాన్ని బట్టి చట్ట నిర్మాతల 'ప్రజాస్వామిక' స్పృహను అర్థం చేసుకోవచ్చు. బడా బడా ఫ్యూడల్ దొరబాబులకు, దళారీ బూర్జువాలకు నిలయమైన మన దేశ చట్టసభలలో ఆ స్పృహ ఎందుకుంటుంది? అలాగే వారి అడుగులకు మడుగులొత్తే కార్యనిర్వాహక వర్గం ఫాసిస్టు పాలనను అమలు చేయడానికి సహజంగానే పరుగులు పెడుతుంటుంది. పోతే న్యాయ పాలికలో పీడిత ప్రజలు ఎన్నడో విశ్వాసం కోల్పోయారు. గత మూడేళ్లలో దేశంలో హిందూ ఫాసిజీకరణ నేపథ్యంలో కాషాయీకరించిబడుతున్న కోర్టులు హిందూ ఫాసిస్టు శక్తులను నిర్దోషులుగానే ప్రకటించి విడిచిపెడుతున్నాయి. మహారాష్ట్రలోని మాలెగాం పేలుళ్ల నుండి గుజరాత్‌లోని మొదసా జిల్లా తాజా పేలుళ్ల వరకు హైప్రొఫైల్స్ పాల్పడ్డ కేసులంటూ పదహారు కేసులను ఎన్ఐఏకు గత ప్రభుత్వం అప్పగించగా సాధ్వీ ప్రయాగ, లెఫ్టినెంట్ కల్నల్ పురోహిత్, దయానంద్ పాండే, ప్రజ్ఞా ఠాకూర్ వరకు పేరు పోయిన కాషాయ ఉగ్రవాదులు, వారి బాసులను వదిలిపెట్టడం దీనికి ఉదాహరణలు. కోపర్డీ కేసులో దళిత యువకులకు మరణశిక్ష విధించిన న్యాయస్థానం, గఢ్‌చిరోలి జిల్లా ఆదివాసులకు, వారితో మేధావులను తప్పుడు కేసులలో

ఇరికించి జీవిత ఖైదు శిక్షలు వినిపించిన కోర్టులు గుజరాత్‌లో 2002లో చోటు చేసుకున్న నరోడా పాటియా ఊచకోతలో కానీ, బిల్‌కిస్ బానో మూడేళ్ల బిడ్డను, ఆమె కుటుంబాన్ని నిర్దాక్షిణ్యంగా హత్య చేసి, ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన కేసులో గానీ హిందుత్వ శక్తులకు న్యాయస్థానాలు విధించిన శిక్షలు చూస్తే అవి ఏ పక్షమో చెప్పకనే చెబుతున్నాయి. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా చెప్పుకునే మీడియాలో కార్పొరేట్ మీడియాకు భిన్నంగా పాలకవర్గాలకు తాళం వేయకుంటే ఈ దేశంలో పాత్రికేయులకు, రచయితలకు, ప్రజాస్వామ్య లౌకిక మేధావులకు ఎలాంటి పరిస్థితి ఎదురవుతుందో దబోల్కర్ నుండి గౌరీ లంకేష్‌ల హత్యలే మన ముందు సాక్ష్యంగా ఉన్నాయి. సామాజిక వేత్త కంచ ఐలయ్య నుండి ఛత్తీస్‌గఢ్‌లో పాత్రికేయులు వినోద్ వర్మతో సహా అనేక మంది వరకు తప్పుడు కేసులతో కటకటాల వెనుక మగ్గుతున్నారు.

భారత రాజ్యాంగంలోని మూడవ భాగంలో పేర్కొన్న మౌలిక హక్కులలోని వాక్, సభా, పత్రికా స్వాతంత్రాలన్నీ హుళక్కి అని రోజూ భారత పౌరులను ఎద్దేవా చేస్తున్నాయి. శ్రేయోరాజ్యం లక్ష్యం అంటూ రూపొందిన ఆదేశిక సూత్రాలు పాలకుల దయా దాక్షిణ్యాలకు వదిలివేయబడ్డ నీతి వచనాలు కాబట్టి అవన్నీ ఉత్తవేనని రుజువైపోయింది. ఈ దేశంలో ముప్పై నుంచి నలభై శాతానికి పైగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోని 'ప్రజాస్వామ్య' భారతం ఇది. ఈ దేశంలో బలవంతంగా విలీనం చేసుకోబడిన కాశ్మీర్ జాతి ప్రజలు ఇప్పటికీ 'ఆజాద్ కాశ్మీర్' అంటూ నినదిస్తూ ఎన్నికలను సంపూర్ణంగా బహిష్కరిస్తున్న 'గణతంత్రం' ఇది. ఈశాన్య ప్రాంత ప్రజలు విడిపోయే హక్కుతో సహా స్వయం నిర్ణయాధికారం కోసం భారత సైన్యాలను ధైర్యంగా ఎదుర్కొంటూ భారత రాజ్యాంగాన్ని ఇప్పటికే అనేకసార్లు తగులబెట్టి తమ నిరసనను ప్రకటించారు.

గత మూడేళ్లుగా దేశంలో హిందుత్వ శక్తుల ఆగడాలు మితిమీరిపోతున్న పరిస్థితులలో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా అప్రతిష్ట పాలవుతున్నది. అవి లౌకికవాదానికి అర్థం 'సర్వమత సమభావన' అంటూ వక్రీకరించి, దేశంలో హిందుత్వ జెండాను ఎగురవేశాయి. 2010-2017 మధ్య గో రక్షణ పేరుతో జరిగిన హింసాత్మక చర్యలలో ముప్పై మంది ప్రాణాలు కోల్పోయారు. 70 మాబ్ లించింగ్ కేసులు జరిగాయి. వీటిలో 98 శాతం మోదీ హయాంలోనే జరిగాయంటూ హతులలో 70 శాతం ముస్లిములే ఉన్నారంటూ సామాజిక మాధ్యమాలలో వివరాలు వెల్లడవుతున్నాయి. దాద్రిలో మహమ్మద్ అఖ్లాక్ నుండి రాజస్థాన్‌లో జైసల్మీర్ జిల్లాలో ప్రజా గాయకుడు మహమ్మద్ ఖాన్, రాజసముంద్ జిల్లాలోని శ్రామికుడు అఫ్రాద్ హత్య వరకు దీనికి సాక్ష్యంగా నిలిచాయి. మరో వైపు దళితులపై సాగుతున్న హిందుత్వ శక్తుల హింసాత్మక చర్యలు అత్యంత పాశవికంగా అవమానకరంగా, సభ్యసమాజం తల దించుకునే విధంగా ఉన్నాయి. బిహార్‌లోని నలంద జిల్లా ఆజాద్‌పూర్ గ్రామస్తుడు నాయీ మహేష్ ఠాకూర్‌ను ఉన్నత కులాలు తనతో భూమిపై ఉమ్మిని నాకించడం, గుజరాత్‌లోని జయేద్ సోలంకీ అనే దళితుడిని మీసాలు పెంచుతున్నందుకు హత్య చేయడం ఇందుకు తాజా ఉదాహరణలు. భారత పౌరులు ఎక్కడైనా నివసించవచ్చునన్న ప్రాథమిక హక్కు కూడా హిందుత్వ శక్తుల దయదాక్షిణ్యాలపై అమలవుతోంది. మణిపురి జాతి ప్రజల హక్కుల కార్యకర్త ఇరోమ్ షర్మిల బ్రిటిష్ పౌరుడు డెస్మాండ్ కౌటిన్హోను వివాహమాడిన 'పాపానికి' కొడైకెనాల్‌లో ఉండనిచ్చేది లేదంటూ హిందూ మక్కల్ కచ్చి ఫత్వా జారీ చేసింది. కాశ్మీర్‌లో సైనిక జవానులే అమ్మాయిల జుట్లు కత్తిరించిన ఘటనలకు పాల్పడుతున్నారు. దేశంలో పరంపరగా సాగుతున్న ఈ ఘటనలు మనువు ప్రవచించిన చాతుర్వర్ణ వ్యవస్థను, కులాల హైన్యాన్ని ఎత్తిపడుతున్నాయి. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే ఈ కాషాయ బ్రిగేడే గుట్టు చప్పుడు కాకుండా ఆ పని చేసి భగవద్గీతను మన దేశ రాజ్యాంగంగా ఎప్పుడైనా ప్రకటించవచ్చు. దేశంలో ఈ విధంగా హిందూ ఫాసిజం నిరాఘాటకంగా పెచ్చరిల్లిపోవడాన్ని చూస్తే భారత రాజ్యాంగం, రాజ్యాంగయంత్రం హిందూ ఫాసిస్టులకు కొమ్ముకాస్తున్నదన్న విషయం స్పష్టంగా బోధపడుతుంది.

### భారతదేశ పీడిత ప్రజలారా!

మన దేశంలో పాలకవర్గాలు ఎన్నడూ వారు రాసుకున్న రాజ్యాంగానికే వారు కట్టుబడింది లేదు. రాజ్యాంగం పేరుతో వారు దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల నియంతృత్వాన్ని రుద్దారు. ఈ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పీడిత ప్రజలు, పీడిత జాతులు, సెక్షన్లు దశాబ్దాలుగా పోరాడుతున్నారు. ఈ క్రమంలోనే భారత గణతంత్ర రాజ్యం, దాని రాజ్యాంగం మద్దతుతో దేశంలో నానాటికీ పెచ్చరిల్లుతున్న హిందూఫాసిజానికి వ్యతిరేకంగా ఎక్కడికక్కడ మతమైనారిటీల, దళితులు, ఆదివాసుల, మహిళల మిలిటెంట్ పోరాటాలు బద్దలవుతున్నాయి. సుడులు తిరుగుతున్న వ్యవసాయ సంక్షోభంలో సతమతమవుతున్న భారత రైతాంగం దేశవ్యాప్తంగా సమరశీల పోరాటాలు చేస్తున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వోద్యోగులు, శ్రామికులు రోడ్ల మీదికి వచ్చి తమ డిమాండ్ల సాధనకై ఉద్యమిస్తున్నారు. అంతేకాదు భారత సైనికులు అంతర్జాలంలో తమ అవస్థలు ప్రపంచానికి చాటుతూ మోది పాలన వైనాన్ని ప్రదర్శిస్తున్నారు. ఉద్యమ ప్రాంతాలలో ఆత్మహత్యలు, పరస్పర హత్యలు పోలీసులలో పెరుగుతున్నాయి. ఇటీవల బీజాపూర్ జిల్లాలో బాసగూడ పోలీసు స్టేషన్‌లో నలుగురు అధికారులను ఒక పోలీసు జవాను మట్టుపెట్టాడు. ఇవన్నీ దేశంలో తీవ్రమవుతున్న విప్లవ పరిస్థితులను వ్యక్తీకరిస్తున్నాయి. ఇలాంటి స్థితిలో ఈ దేశ బూటకపు రాజ్యాంగాన్ని, రాజ్యాంగ యంత్రాన్ని, దేశంలోని బ్రాహ్మణీయ హిందూ అర్ధవలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థను ధ్వంసం చేసేందుకు, దేశంలో కార్మిక-కర్షక మైత్రిపై ఆధారపడి, ఈ నాలుగు విప్లవ వర్గాలకు - కార్మికులు, రైతాంగం, పట్టణ పెటీ బూర్జువా, జాతీయ బూర్జువా - చెందిన నిజమైన ప్రజాస్వామిక వ్యవస్థ-ఫెడరల్ ప్రజాస్వామిక వ్యవస్థ, దాని రాజ్యాంగ నిర్మాణం కోసం, సాయుధ వ్యవసాయ విప్లవం ఇరుసుగా ఉన్న నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాలో విజయవంతం చేసేందుకు తెగించి పోరాడాల్సిందిగా మా పార్టీ సిపిఐ (మావోయిస్టు) పిలుపునిస్తోంది.

### ప్రగతిశీల, ప్రజాస్వామ్య, లౌకికవాదులారా, రాజ్యాంగ ప్రేమికులారా!

కేంద్రంలో హిందుత్వ శక్తులు అధికారంలోకి వచ్చాక కొనసాగుతున్న వారి ఆగడాలకు వ్యతిరేకంగా ప్రగతిశీల, ప్రజాస్వామ్య, లౌకికవాదులుగా ఉన్న మీరు వివిధ రూపాలలో మీ నిరసనను తెలియజేస్తున్నారు. లబ్దప్రతిష్టులైన పెద్దలు తమకు దొరికిన ప్రభుత్వ పురస్కారాలను ప్రభుత్వం ముఖాన వారు తిప్పికొట్టడం కూడా జరుగుతోంది. ఈ బూటకపు గణతంత్ర దినోత్సవాల సందర్భంగా హిందూ ఫాసిజానికి కొమ్ముగాస్తున్న భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగయంత్రాన్ని దేశంలోని పీడిత ప్రజలు, జాతులు, సెక్షన్లు సమైక్యంగా ఎండగట్టడం ఎంతో అవసరం ముందుకు వచ్చింది. లేకపోతే మార్క్స్ మహాశయుడు హెచ్చరించినట్టు, 'పాలకవర్గం, పాలితవర్గపు మేధావులను ఎంత ఎక్కువగానైతే తనలో ఇముడ్చుకుంటుందో అంత స్థిరంగానూ, అంత ప్రమాదకరంగానూ దాని పాలన తయారవుతుంది' అనేది యథార్థం కాక తప్పదు. రండి! ఈ దేశంలోని పీడిత ప్రజలకు హిందూ

ఫాసిజం నుంచి పెరుగుతున్న ప్రమాదాన్ని వివరిస్తూ మీరు 2018 గణతంత్ర దిన వేడుకలను బహిష్కరించండి! దేశ వనరుల దోచబెట్టేందుకై, వీటిని తరతరాలుగా కాపాడుతున్న మూలవాసీ ప్రజల అస్తిత్వాన్ని సైతం లెక్క చేయకుండా విదేశీ కార్పొరేటు వర్గాల ప్రతినిధులను గణతంత్ర దిన వేడుకలకు ఆహ్వానించడాన్ని తీవ్రంగా ఖండించండి. ఈ రాజ్యాంగం బూటకమైనదంటూ ప్రకటించి '... అసమానత్వాల వల్ల బాధలు పడేవాళ్లు రాజ్యాంగ సభ అత్యంత శ్రమతో నిర్మించిన రాజకీయ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని పేల్చివేస్తారు...' అంటూ అంబేద్కర్ చేసిన హెచ్చరికను నిజం చేయండి!

**అభయ్, అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ,**
**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**